ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 అక్టోబరు 2024



జిల్లా విద్యాశాఖ అధికారిగా మాణిక్య నాయుడు

విజయనగరం/కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారిగా యు.మాణిక్యనాయుడును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన విశాఖపట్నంలో డైట్ లెక్చరర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడ వస్తున్నారు. ఇక్కడి డీఈవో ప్రేమకుమార్ విశాఖకు బదిలీ అయ్యింది.

● జిల్లా రెవెన్యూ అధికారి డి.అనితను ప్రభుత్వం బదిలీ చేసింది. జేఏడీకి రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక్కడకు వెయింటింగ్‌లో ఉన్న ఎస్.శ్రీనివాసమూర్తిని డీఆర్వోగా నియమించింది. గతంలో ఈయన విజయనగరం ఆర్డీవోగా పని చేశారు.



అయ్యారే.. కోనేరు అందాలు

విజయనగరం పట్టణంలోని అయ్యకోనేరు విభిన్న జాతుల పక్షులు.. జలచరాలతో చూపరులను కనువిందు చేస్తోంది. కోనేటిలోని రాళ్లపైకి వచ్చి సేదదీరే తాబేళ్లు, ఆహార వేటలో మునిగిపోయే విదేశీ విహంగాలతో ఆ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంది. ఈ అద్భుత దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

6లో

మంటల్లో బస్సులు



● షార్ట్ సర్క్యూట్‌తో రెండు వాహనాలు దగ్ధం

విజయనగరం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలోని రాజీవ్‌క్రీడా ప్రాంగణ సమీపంలో పార్కింగ్ చేసి ఉన్న రెండు ప్రైవేటు బస్సులు గురువారం వేకువజామున 5 గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బస్సుల్లోని సీట్లు పూర్తిగా కాలిపోయాయి. తెల్లవారు జామున కావడం, బస్సుల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆస్తినష్టం రూ.10 లక్షలు ఉంటుందని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు తెలిపారు. వాహనాల యాజమాని కోరాడ తాతారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటిదొంగల పనేనా?

● బెల్టు నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలుపై ఎస్పీ ఆరా

● సమగ్ర విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ (ఆంధ్ర జ్యోతి) అక్టోబరు 24: మెంటాడ , గజపతిన గరం మండలాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెం ట్ సిబ్బంది బెల్ట్ షాపుల నిర్వాహకులను బెదిరించి డబ్బును గుంజిన వ్యవహారంపై జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశించారు. ఈ రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం కొందరు వ్యక్తులు తాము ఎన్‌ఫోర్స్‌మెంట్‌అధికారులమంటూ బెల్టుషాపుల్లో సోడాల పేరుతో లక్ష రూపాయలు మేర వసూలు చేశారు. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'మేం పోలీసులం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఎస్పీ వకుల్ జిందాల్ స్పందించారు. వెంటనే విచారణ చేపట్టి నిగ్గుతేల్చాలని ఆంధ్ర, గజపతినగరం ఎస్‌ఐలను ఆదేశించారు. వారికి 'ఆంధ్రజ్యోతి' క్లిప్పింగులను కూడా పంపారు. ఈ వ్యవహారం బయటపడటంతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తుల్లో కలకలం మొదలైంది. డబ్బులు ఇచ్చిన బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఆయా గ్రామాల్లో తమకు పరిచయాలు ఉన్న వారి ద్వారా నగదు వాపసు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎస్పీ ఆదేశాల మేరకు ఆంధ్ర, గజపతినగరం ఎస్‌ఐలు రంగంలోకి దిగారు. పోలీసులుగా వచ్చిన వ్యక్తులు ఎవరు, ఏఏ గ్రామాల్లో బెల్టుషాపుల వద్దకు వెళ్లారు, నిర్వాహకుల నుంచి ఎంత వసూలు చేశారు.. తదితర వివరాలను ఆరా తీసే పనిలో పడ్డారు. ఇందులో ఇంటిదొంగలు ఎవరైనా ఉన్నారా ? వచ్చినవారు నకిలీలా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలతో ఎస్పీకి నివేదిక ఇవ్వనున్నారు. ఐదుగురు వ్యక్తులు ఓ వాహనంలో వచ్చారని, వచ్చిన వెంటనే హడావుడి చేశారని బాధితులు చెబుతున్నారు. మొత్తమ్మీద,ఈ వ్యవహారం పోలీసువర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

● గత ఐదేళ్లలో అస్తవ్యస్తం ● ప్రతిపక్షం లేకపోవడంతో ఇష్టారాజ్యం

● నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం ● సమస్యలపై వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం

జడ్పీ గాడినపడేనా?



● గుర్ల తదితర ప్రాంతాల్లో డయేరియా వ్యాప్తి చెందడానికి ముఖ్య కారణం వైసీపీయేనని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పాలించింది. ఇప్పుడు కూడా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో వైసీపీ వారే పాలకులుగా చెలమని అవుతున్నారు. జడ్పీ ఛైర్మన్‌తో పాటు ఎంపీపీలు, జడ్పీటీలు, ఎంపీటీసీలుగా ఎక్కువగా వైసీపీ సభ్యులే ఉన్నారు. మరి గుర్ల ఘటనపై అధికార పార్టీపై నిందలు ఎలా వేస్తారు. జడ్పీ పాలకులకు బాధ్యత లేదా?. వారి నిర్వాకం వలనే గుర్ల, తదితర ప్రాంతాల్లో డయేరియా వ్యాప్తి చెందిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● ఈ నెల 21న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గుర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి శాపాలుగా మారాయని అన్నారు. వైసీపీ సర్కారు గ్రామాలను పట్టించుకోలేదని, పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదని, దీంతో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తమై డయేరియా వంటి రోగాలు ప్రబలుతున్నాయని మండిపడ్డారు.

● జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఓ సందర్భంలో మాట్లాడుతూ.. 'గుర్లలో డయేరియా వ్యాప్తి చెందడానికి కలుషిత నీరు కారణమని వైద్యులు, అధికార యంత్రాంగం చెబుతున్నారు. జలజీవన్ మిషన్ కోసం కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులు మంజూరు చేస్తే, ఆ పనులు పూర్తి చేయడంలో జగన్ సర్కారు విఫలమైంది.కేవలం పైపులు వేసి బిల్లులు చేసుకున్నారు. దీంతో తాగునీరు కలుషితమై గుర్లలో డయేరియా వ్యాపించింది. ఇది ముమ్మాటికీ గత పాలకుల పాపమేనని' అన్నారు.

విజయనగరం/ విజయనగరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లూ జిల్లా పరిషత్ సమావేశాలు ఏకపక్షంగా సాగాయి. కనీస స్థాయిలో కూడా ప్రతిపక్షాలకు చోటు ఉండేది కాదు. అప్పటి అధికార వైసీపీ ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది. వైసీపీ హయాంలో జడ్పీని అచేతనం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా గ్రామీణ పాలనకు ప్రధాన వారధిగా జిల్లా పరిషత్ ఉండాలి. కానీ, గత సర్కారు జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, డీసీసీబీ ఛైర్మన్, ఇలా ప్రతిఒక్కరినీ ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. సంక్షేమం మాటున వివిధ శాఖల ప్రగతిని తుంచేసింది. అది ప్రజలకు శాపంగా మారింది. గుర్ల డయేరియా ఘటనకు ముమ్మాటికీ వైసీపీ ప్రభుత్వ వైఫల్యమే కారణం. అక్కడ భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు నిర్ధారించారు. కానీ, నాలుగు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఈ నింద మోపుతున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య జరగనుంది. సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. దీంతో జడ్పీలో వాడీవేడి చర్చ కొనసాగనుంది. అధికార పక్ష ప్రజాప్రతినిధులు గళం ఎత్తే అవకాశముంది. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో జడ్పీ వైఫల్యాలు బయటపడే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రాభవం కోల్పోయింది..

32 శాఖల పర్యవేక్షణతో, పుష్కలమైన నిధులతో తొణికిసలాడాల్సిన జిల్లా పరిషత్ వైసీపీ ప్రభుత్వ హయాంలో తన ప్రాభవం కోల్పోయింది. న్యాయబద్ధంగా జడ్పీకి రావాల్సిన స్థానిక సంస్థల పన్నులు, గనులు, ఇసుక సీనరేజ్ చార్జీలు వంటివి ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. గతంలో సీనరేజ్ రూపంలో వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు 50 శాతం, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు చెరో 50 శాతం పంచుకునేవి. అయితే సీనరేజ్ చార్జీలను గత కొన్నేళ్లుగా చెల్లించడం లేదు. నేరుగా ప్రభుత్వ ఖాతాకే జమ అవుతున్నాయి. అలాగే, రిజిస్ట్రేషన్ సర్ చార్జీలు, నీటి తీరువా పన్నుల ద్వారా కొంత మొత్తం స్థానిక సంస్థలకు ఆదాయం వచ్చేది. ఎకరాకు నీటి తరువా రూ200 వసూలు చేస్తే అందులో 5 నుంచి 10 శాతం పంచాయతీలకు జమ అయ్యేది. పంచాయతీ పరిధిలో ఎవరైనా భూములు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టయితే ఆ శాఖ నుంచి సర్ చార్జీల రూపంలో కొంత మొత్తం పంచాయతీలకు వచ్చేది. కానీ కొన్నేళ్లుగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో ఆదాయం లేక ఎమ్మెల్యేలు, ఎంపీల నిధులపై ఆధారపడుతున్నారు. కొన్ని మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు కూర్చునేందుకు కనీసం చాంబర్లు లేవు.

రైతాంగానికి తీవ్ర అన్యాయం

వైసీపీ పాలనలో జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగింది. సాగునీటి సమస్యలను పరిష్కరించకపోవడంతో వ్యవసాయ సబ్సిడీలు అందించకపోవడంతో అన్నదాతలు అనేక అవస్థలు పడ్డారు. ఉమ్మడి జిల్లాలో అనేక సాగునీటి కాలువల్లో పూడికలు, తుప్పలు తొలగింపునకు నిధులు విదల్చలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వ

- మిగతా 8వ పేజీలో..

ధైర్యంగా ఉండండి

● మీ కష్టాలను తీరుస్తాం

● హోంమంత్రి అనిత

● గుర్ల డయేరియా బాధితులకు పరామర్శ

గుర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'మీ కష్టాలను చూశాం. వాటిని పరిష్కరించే బాధ్యత మాది. ధైర్యంగా ఉండండి' అని హోంమంత్రి వంగలపూడి అనిత గుర్ల డయేరియా బాధితులకు హామీ ఇచ్చారు. గురువారం గుర్లలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి డయేరియా బాధితులను పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి పరిస్థితులు రావడానికి గల కారణాలపై ఆరా తీశారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు అధికారులు అండగా ఉండాలన్నారు. బాధ్యతగా పనిచేస్తే ఇలాంటి పరిస్థితులు తలెత్తవని అన్నారు. కొంతమంది మహిళలు తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, లోకం మాధవి, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అనిత

అధికారులపై చర్యలు తప్పవు

విజయనగరం(కలెక్టరేట్) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇకపై డయేరియాతో ఏ ఒక్కరూ మృతి చెందినా ఆయా శాఖ అధికారులపై చర్యలు తప్పవని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గుర్ల పర్యటన అనంతరం గురువారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి శాఖకు ఒక నిర్దిష్ట కార్యాచరణ ఉంటుందని, దాని ప్రకారం పని చేయాలని స్పష్టం చేశారు. 'సాధారణంగా వర్షాకాలంలో సీజ నల్ వ్యాధులు ప్రబలుతాయి. ముందస్తు చర్యలతో వాటిని నివారించాలి. వ్యాధులు వచ్చిన తర్వాత కాకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవల్సి ఉంటుం ది. గుర్ల ఘటన ఎంతో బాధను కలిగించింది. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వచ్చే 10 రోజులు అన్ని వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం జరగాలి. జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి, జిల్లా పరిపాలన సజావుగా జరగాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పని చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి. ప్రజల నుంచి వచ్చే వినతులపై సానుకూలంగా వ్యవహరించాలి. ప్రతి అర్జీదారునికి రాత పూర్వక సమాధానం ఇవ్వాలని' అన్నారు.

నిధులు ఉన్నాయి: మంత్రి శ్రీనివాస్

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని, ఎలాంటి నిధులు కొరత లేదని, తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రక్షిత ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. విధులపై అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, భరత్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

అసహనం.. గందరగోళం

● గుర్లలో మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటన

● కార్యకర్తల అరుపులతో ఆగ్రహం

● కొద్దిసేపు వెనక్కి వెళ్లి మళ్లీ వచ్చిన వైనం

● డయేరియా బాధితులకు పరామర్శ

● మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న జగన్

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/గుర్ల అక్టోబరు 24: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం గుర్లలో పర్యటించారు. అసహనం, గందరగోళం మధ్య ఆయన పర్యటన సాగింది. ముందుగా ఎస్‌ఎస్‌ఆర్‌పేట నుంచి బయలుదేరిన ఆయన గుర్ల గ్రామానికి చేరుకున్నారు. ఇక్కడ ఒకవైపు బాధితులు, మరోవైపు ప్రజలు, ఇంకోవైపు నాయకులు హడావిడి ఎక్కువకావడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. కార్యకర్తల కేరింతలు, అరుపులను చూసి ఆయన అసహనానికి గురయ్యారు. అక్కడి నుంచి కొంతదూరం వెళ్లిపోయారు. వెంటనే జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆయన్ను తీసుకొని వచ్చారు. అనంతరం డయేరియా బాధితులను పరామర్శించారు. వైసీపీ తరఫున డయేరియా మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

అందరినీ ఆదుకుంటాం

డయేరియా బాధితుల పరామర్శ అనంతరం మీడియాతో జగన్ మాట్లాడారు. 'ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా, అక్కడకు నేను వెళ్లి వారికి అండగా ఉంటున్నా. గుర్లలో డయేరియాను అదుపు చేయకుండా చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, మంత్రులు, ఉన్నతాధికారులు తలోమాట ఆడుతున్నారు. వాస్తవంగా గుర్ల తదితర గ్రామాల్లో 14 మంది డయేరియాతో చనిపోయారు. కానీ, చంద్రబాబు 8 మంది అని, దత్తపుత్రుడు 10 మంది అని, మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్ ఒక్కరు మాత్రమే చనిపోయారని చెబుతున్నారు. వీరు వాస్తవాలు మాట్లాడడం లేదు. డయేరియా విషయమై నేను ఈ నెల 19న ట్వీట్ చేశా. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు' అన్నారు. 'మంచినీటి సమస్యతో గుర్లలో డయేరియా ప్రబలింది. రక్షిత ట్యాంకులను సమయానికి శుభ్రం చేయాల్సి ఉంది. కానీ, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. చంపావతి నది నీళ్లు దారుణంగా ఉన్నాయి. గుర్ల మండలానికి సంబంధించి 345 మంది డయేరియా బాధితులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో అంతకంటే ఎక్కువగా దాదాపు 450 మంది చికిత్స పొందుతున్నారు. ఇప్పటికీ గరివిడి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో డయేరియా కేసుల నమోదవుతున్నాయి. ఇంకా 62 మంది చికిత్స పొందుతున్నారు' అన్నారు. కార్యక్రమంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, పుష్పశ్రీవాణి, జడ్పీ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని అందం.. పరవశింపజేసే సోయగం

● ఆకట్టుకుంటున్న తాటిపూడి అందాలు

● రిజర్వాయర్ వెనుక భాగంలో అద్భుత దృశ్యాలు

6లో



పిచ్చి కుక్కల స్వైర విహారం

● చీపురుపల్లిలో 53 మందికి గాయాలు


● ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

7లో

సైబర్ నేరగాళ్లను చైతన్యంతో ఎదుర్కోవాలి

● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

7లో



అయ్యారే.. కోనేరు అందాలు!

అయ్యా కోనేరు... విజయనగరం పట్టణంతో అనుబంధం ఉన్నవారందరికీ పరిచయం ఉన్న పేరు. ఇది అనేకజీవరాశులకు నిలయం. విభిన్న జాతుల పక్షులు.. జలచరాలకు నివాసం. ఎప్పుడూ నీటిలో ఉంటే ఎలా? అప్పుడప్పుడూ బయటి ప్రపంచం చూద్దాం అన్నట్టుగా కోనేటిలోని రాళ్లపైకి వచ్చి సేదదీరే తాబేళ్లు... మీ దేశం వచ్చాం కాబట్టి... ఆహార బాధ్యతలూ మీవే అన్నట్టుగా ఆహార వేటలో మునిగిపోయే విదేశీ విహంగాలు... చేప పిల్లల కోసం ఒంటి కాలి తపస్సు చేసే కొంగమ్మలు... బుల్లిపిట్టల కిలకిలారావాలు... కోనేరు పరిసరాల్లో ఉదయం.. సాయంత్రం వేళ నడకకు వెళ్లే వారికి నిత్యం కనిపించే దృశ్యాలు. ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలను తమ సెల్ ఫోన్ కెమెరాల్లో బంధించి... మురిసిపోతుంటారు.

-విజయనగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

పట్టణాభివృద్ధే లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు



పార్వతీపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ) శ్రీనివాసరాజు చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: పట్టణంలో ప్రధాన సమస్య ఏమిటో గుర్తించారా?

జవాబు: పట్టణ ప్రజలను వేధిస్తున్న తీవ్రమైన సమస్య తాగునీటి సరఫరాగా గుర్తించాను. త్వరలోనే పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాను.

ప్ర: ఇంకా ఏఏ సమస్యలను గుర్తించారు?

జ: తాగునీటి సరఫరాతో పాటు పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణ సమస్యలు నా దృష్టికి వచ్చాయి. పక్కా ప్రణాళికతో ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా.

ప్ర: మన్యం జిల్లా కేంద్రంలో బాధ్యతల విషయాన్ని ఎలా భావిస్తున్నారు?

జ: మన్యం జిల్లా కేంద్రమైన మున్సిపాలిటీకి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించడమంటే కత్తి మీద సాము లాంటిది. ఎమ్మెల్యే విజయచంద్ర, సంబంధిత శాఖల అధికారుల సలహాలు, సూచనలతో ముందుకు వెళతా.

ప్ర: ఓ వైపు ఇంజనీరింగ్ విభాగం డీఈగా, మరో వైపు ఎఫ్ఏసీ కమిషనర్‌గా విధులను ఎలా సమన్వయం చేసుకుంటారు?

జ: ఇక్కడికి వచ్చిన రెండు రోజుల్లోనే తాగు నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టా. కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టడమంటే కొంత కష్టమే. కానీ చిత్తశుద్ధితో పనిచేస్తే సాధ్యం కానిది ఏదీ లేదని నా నమ్మకం.

ప్ర: పట్టణ శివారుల్లో గల డంపింగ్ యార్డు విషయంలో ఏం చేయబోతున్నారు?

జ: పట్టణ శివారుల్లో ఉన్న డంపింగ్ యార్డు తరలింపునకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర సహకారంతో నావంతు ప్రయత్నం చేస్తా.

ప్ర: ప్రభుత్వ పథకాలు పేదలకు చేరేందుకు ఏం చేస్తారు?

ప్ర: ఎన్డీయే ప్రభుత్వ పథకాలు పేదలకు చేరేందుకు కార్యాలయ అధికారులు, సచివాలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటా.

శ్యామలాంబ పండుగకు దండోరా


శ్యామలాంబ పండుగ కోసం దండోరా వేస్తున్న దృశ్యం

సాలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండుగకు గురువారం దండోరా ప్రక్రియ నిర్వ హించారు. ముందుగా యువరాజు విక్రమ చంద్ర సన్యాసిరాజు ఇంటి వద్ద అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్యాన అప్పారావు, నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), కొనిసి చిన్ని, బృందావనం అశోక్, మండల ఈశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణ తలయారీ యజ్జల శంకరరావు దండోరా వాయించారు. వచ్చే ఏడాది మే నెలలో అమ్మవారి పండుగను నిర్వహిస్తామని చెప్పారు. అదే నెలలో 18వ తేదీన అమ్మవారికి ఉయ్యాల కంబాల ఉత్సవం, 19న తోలేళ్ల ఉత్సవం, 20న సిరిమాను ఉరేగింపు, 21న అనుపోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

ఇక సులువుగా పాస్‌పోర్టు

- ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పిస్తే చాలు



కొమరాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు అనేది ఒకప్పుడు స్టేటస్ సింబల్. సంపన్న వర్గాలకే పరిమితమయ్యేది. కాలం మారింది. విద్యారంగ మార్పుల ఫలితంగా సాధారణ విద్యార్థి కూడా విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేస్తున్నాడు. మధ్య తరగతి వారూ విదేశాల బాట పడుతున్నారు. గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలు పెరగడంతో చదువుతో పని లేకుండా యువత వలసబాట పడుతున్నారు. దీంతో అన్ని వర్గాలకూ ఇప్పుడు పాస్‌పోర్ట్ అవసరంగా మారిపోయింది. అందుకే గతంలో ప్రహసంగా ఉండే దరఖాస్తు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం సులభతరం చేసింది. పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి పడిగాపులు కాయకుండా ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

యాప్ ద్వారా దరఖాస్తు ఇలా..

- కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్‌లో ఎం.పాస్‌పోర్ట్ అనే సేవా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేశాక న్యూ యూజర్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేయాలి.
- చిరునామా ఆధారంగా పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఎంచుకోవాలి.
- పేరు, పుట్టిన తేదీ, ఈ-మెయిల్ ఐడీ లాంటి సమాచారం నమోదు చేయాలి. లాగిన్ ఐడీ అయ్యాక పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. సెక్యూరిటీ కోసం ఓ ప్రశ్న, సమాధానం ఎంచుకోవాలి. క్యాప్చా కోడ్‌ను కూడా నమోదు చేసి సబ్మిట్ వద్ద క్లిక్ చేయాలి. ఐడి, పాస్‌వర్డ్‌లను మాత్రం మర్చిపోకూడదు సుమా.
- పాస్‌పోర్టు కార్యాలయం ద్వారా దరఖాస్తుదారుడి మెయిల్‌కు ఓ ధ్రువీకరణ లింకు వస్తుంది. దీనిని క్లిక్ చేస్తే వెబ్ పేజీ ఓపెన్ అవుతుంది. ధ్రువీకరణకు మీ లాగిన్ ఐడీ నమోదు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఖాతా ధ్రువీకరించుకుని యాప్‌ను క్లోజ్ చేసి మళ్లీ లాగిన్ చేయాలి.
- అప్లై ఫర్ పాస్‌పోర్టు వద్ద మళ్లీ క్లిక్ చేయాలి. అక్కడ కోరిన సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఆధార్, చిరునామా వివరాలు తప్పనిసరి. తరువాత పాస్‌పోర్టు కోసం ఆన్‌లైన్‌లో రూ.1,500 చెల్లించాలి. అపాయింట్‌మెంట్ తేదీని నిర్ణయించుకుని సంబంధిత కాలమ్‌లో ప్రస్తావించాలి.
- దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక పాస్‌పోర్టు కేంద్రానికి వెళ్లి... అవసరమైన పత్రాలను అందజేయాలి.
- సర్టిఫికెట్లు ఓకే అయ్యాక కొన్ని రోజుల్లోనే పోలీసు వెరిఫికేషన్ జరుగుతుంది. స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ వచ్చి నేర చరిత్ర లాంటి వివరాలపై విచారిస్తారు. అనంతరం కొద్ది రోజుల్లోనే పాస్‌పోర్టు ఇంటికి అందుతుంది.



ఆకాశాన్ని తాకినట్టు కనిపించే కొండలు... కనుచూపు మేర పచ్చదనం... భూమిపైకి విహారానికి వచ్చినట్టు కనిపించే మేఘాల సమూహాలు... మంచు తెమ్మెరల సందోహం... ఈ దృశ్యాల గురించి చెబుతుంటే... ఏ అనంతగిరి అందాలో... లంబసింగి ప్రాంతమో కళ్లముందు కదలాడుతున్నాయా? మీరు అంతదూరం వెళ్ల కుడానే... అలాంటి దృశ్యాలను మన జిల్లాలో చూడవచ్చు. అదెక్కడో తెలుసా? తాడిపూడి రిజర్వాయర్ ప్రాంతంలో...

పచ్చని అందం.. పరవశింపజేసే సోయగం!

- ఆకట్టుకుంటున్న తాటిపూడి అందాలు
- రిజర్వాయర్ వెనుక భాగంలో అద్భుత దృశ్యాలు

శృంగవరపుకోట/గంట్యాడ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

తాడిపూడి రిజర్వాయర్ అంటే అందరికీ గుర్తొచ్చేది బోటు షికారు. దూరంగా కనిపించే కొండలు. ఇప్పటి వరకూ అత్యధిక శాతం సందర్శకులు చూసినవి ఇవే. ఆ కొండల వెనుకనున్న ప్రకృతి దృశ్యాలు మనల్ని అక్కడి నుంచి కదలనీయవన్న సంగతి తెలిసినవారు చాలా తక్కువ. తాటిపూడి రిజర్వాయర్ వెనుక భాగంలోని కొండపై కొలువైన శ్రీ అనంత వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి కిందకు చూడడానికి రెండు కళ్లు చాలవంటే అతిశయోక్తి కాదు. అల్లూరి సీతారామరాజు (పూర్వ విశాఖ) జిల్లా అరకు, అనంతగిరుల్లో కనిపించని అందాలు ఇక్కడ సాక్షాత్కారమవుతాయి. ఇక్కడి కొండల మధ్య నుంచి ప్రవహించే గంగమ్మతల్లి సోయగాలు చూసి తీరాల్సిందే. చుట్టూ కొండలు, కింద నీటి గలగలలు. పైన తెలియాడే మేఘాలతో కలబోసిన పొగమంచు. సూర్యోదయం, సూర్యాస్తమయ వేళల్లో చూసి తీరాల్సిన దృశ్యాలివి.

ఎక్కడ అంటే...

గంట్యాడ మండలం తాటిపూడి రిజర్వాయర్ వెనుక భాగంలో సుందర దృశ్యాలు కనువిందు చేస్తాయి. ఎగువ, దిగువ కొండపర్తి గ్రామాల సరిహద్దుల్లో ఉన్న కొండపై శ్రీ అనంత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. విగ్రహ ప్రతిష్ఠ పూర్తి కావడంతో ఇప్పుడిప్పుడే పూజలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో పూజలు చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. తాటిపూడి జలశయం వెనుక కనిపిస్తున్న అందాలకు ముగ్ధులవుతున్నారు. ఈ దేవాలయ నిర్మాణంతోనే తాటిపూడి అందాలు బయటపడ్డాయి. అరకు, బొర్రా గుహలకు వేళ్లేవారంతా వీటిని చూసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పుడిప్పుడే ఈ ప్రదేశం గురించి బయటి ప్రపంచానికి తెలుస్తోంది.



కాశీపట్టణం-ఎగువ, దిగువ కొండపర్తి దారిలో తాగునీరు పట్టుకుంటున్న గిరిజన బాలికలు, విసిరేసినట్లున్న నివాసాలు


శ్రీ అనంత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

వాటిని వదలొద్దు..

ఎస్ఆర్‌పురం సీతాఫలాలకు ప్రత్యేకత ఉంది. వీటి రుచే వేరు. ఈ సీజన్‌లో అటు వెళ్లిన వారు సీతాఫలాలను రుచి చూడకుండా రావద్దు. మరెందుకు ఆలస్యం? పదండి. తాడిపూడి అందాల ప్రపంచాన్ని చూసేద్దాం.

ఎలా వెళ్లాలంటే...

విశాఖ-అరకు రోడ్డులో ఉన్న శృంగవరపుకోట మండలం బొడ్డవర నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఈ అందాల ప్రదేశం ఉంది. కాశీపట్టణం వెళ్లిన తరువాత అరకు రోడ్డులో కాకుండా పక్క నుంచి ఎస్ఆర్‌పురం రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డంతా పాము మెలికలను పోలి ఉంటుంది. ఈ రోడ్డు పొడవునా ఇరువైపులా పచ్చదనం పరుచుకుంది. ఎత్తయిన పచ్చని కొండలు, వాటిపై తెలియాడే మేఘాలు, ఉదయం, సాయంత్ర కొండలను కప్పిన మంచు దుప్పటి ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్టు కనిపిస్తాయి. పచ్చటి పొలాల మధ్య అక్కడక్కడ విసిరేసినట్లున్న గిరిజన నివాసాలు... వాటి వద్ద ఆడుకుంటున్న గిరిజన బాలబాలికలు... పట్టుకుంటున్న తాగునీరు.. జీవనాధారానికి పెంచుకుంటున్న గొర్రెల మందలు కమనీయంగా కనిపిస్తాయి. మార్గమధ్యలో ఎస్ఆర్‌పురం జలపాతం కట్టిపడేస్తుంది. దీన్ని అభివృద్ధి పరచకపోవడంతో చెట్లు, తుప్పల మధ్య నుంచి కిందకు దిగి వెళ్లేందుకు మహిళలు భయపడుతున్నారు. దీన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల తాకిడి పెరుగుతుందనడంలో సందేహం లేదు.

విస్తరణ కలేనా?

- అభివృద్ధికి నోచని శంబర పోలమాంబ ఆలయం
- ఏటా భక్తులకు తప్పని అవస్థలు


జనావాసాల మధ్య ఉన్న చదురుగుడి


శంబర పోలమాంబ

మక్కువ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతరకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎక్కడా లేని విధంగా పదివారాల పాటు ఇక్కడ జాతర జరుగుతుంది. ఏటా జనవరిలో సంక్రాంతి తర్వాత మంగళవారం జరిగే పండగకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ నుంచి లక్షలాది మంది భక్తులు వస్తూ ఉంటారు. అయితే ఆదాయం బాగానే వస్తున్నా.. ఆలయ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ప్రధానంగా భక్తులు ఉండేందుకు షెడ్లు, బాత్‌రూములు, మరుగుదొడ్ల నిర్మాణం.. ఇతరత్రా వసతుల కల్పన కలగానే మారింది. మరోవైపు ఏటా టెంట్లు, బారికేడ్లు, ఇతర సామగ్రి కోసం టెండర్లు పిలవడంతో లక్షలాది రుపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ఇదిలా ఉండగా.. అమ్మవారి చదురుగుడి జనావాసాల మధ్య ఉండడంతో ఏటా భక్తులకు అవస్థలు తప్పడం లేదు. జాతర జరిగే సమయంలో వేలాదిగా తరలివచ్చే భక్తజనం క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించి.. ఆపసోపాలు పడుతూ అమ్మవారిని దర్శించుకోవాల్సి వస్తోంది. ఆలయం ఇరుకుగా ఉండడం, క్యూలైన్లు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసేందుకు అవకాశం లేకపోవడంతో ఏటా వారికి ఇక్కట్లు తప్పడం లేదు.

విస్తరణకు బ్రేక్..

గతంలో ఆలయ అభివృద్ధికి అడుగులు పడ్డాయి. చదురుగుడికి ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగించేందుకు దేవదాయ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇళ్ల యజమానులతో మాట్లాడి నష్ట పరిహారం.... ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇస్తామని ప్రతిపాదించారు. సంబంధిత యజమానులు అధిక మొత్తంలో పరిహారం కోరడంతో చర్చలు కొలిక్కి రాలేదు. దీంతో ఆలయ విస్తరణకు బ్రేక్ పడింది. నిధులు మంజూరైనా వనం, చదురు గుడులు, సిరిమాను తిరిగే ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వచ్చే ఏడాది జనవరిలో శంబర పోలమాంబ జాతర సమయానికి ఆలయ విస్తరణ జరిగేలా కనిపించడం లేదు. ఏటాలానే ఈసారి కూడా భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

నివేదిక అందించాం..

పోలమాంబ చదరగుడి విస్తరణపై ఆలయానికి ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులతో మాట్లాడినా ఫలితం లేకుండాపోయింది. ఈ సమస్యను నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందించాం. తదుపరి ఆదేశాల మేరకు ఆలయ విస్తరణ చర్యలు చేపడతాం.

- వీవీ సూర్యనారాయణ, ఆలయ ఈవో

ఏటా అవస్థలే..

ఏటా చదురు గుడిలో పోలమాంబను దర్శించుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఆలయ విస్తరణ కార్యరూపం దాల్చడం లేదు. నూతన ప్రభుత్వమైనా ఆలయ అభివృద్ధికి చొరవ చూపాలి.

-కె.లక్ష్మణరావు, కవిరిపల్లి గ్రామం

న్యూస్ బాక్స్

వేతనాలు విడుదల చేయాలి

లక్కవరపుకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి గాడి అప్పారావు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, యూనిఫాం, బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకులు తరిని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం హుండీ లెక్కింపు

నెల్లిమర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామివారి దేవస్థానం హుండీ ఆదాయం 28లక్షల 8 వేల 291 రూ పాయలు లభించింది. మే 29 నుంచి గురువారం వరకు 5 నెలల కాలం వరకు ఈ ఆదాయం లభించినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈవో డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో రామతీర్థం ఈవో వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ హుండీ లెక్కింపు జరిగింది.

ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖతో జేఎన్‌టీయూ ఒప్పందం

విజయనగరం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ విజయనగరం విశ్వవిద్యాలయం, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ మధ్య యూనివర్శిటీ సమావేశ హాలులో గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, మానవ వనరులను కూడా జేఎన్‌టీయూ ఎంఎస్ఎంఈకి అందజేయనుంది. ఇందుకోసం యూనివర్సిటీలో కూడా విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు. కళాశాల తరపున వివిధ విభాగాధిపతులు, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ తరుపున జి.ప్రసాద్‌రెడ్డి, టి విజయకృష్ణ పాల్గొన్నారు.

గిరిజన బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలి

శృంగవరపుకోట,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల కేంద్రంలో గిరిజన బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకులు పల్లసురేష్, శివ, రాయుడు తదితరులు కోరారు. గురువారం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు గిరిజన సంక్షేమ వసతి గృహాలను పరిశీలించారు. పలు సమస్యలను గుర్తించారు. వాటిని పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించారు.

ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

శృంగవరపుకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి, ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 300 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 93మంది వివిధ పరిశ్రమలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ కేశవరావు, జేకేసీ కోఆర్డినేటర్ ఈరన్న, డిస్ట్రిక్ట్ ప్లేస్‌మెంట్ అధికారి భాస్కరరావు తదితరులున్నారు.

ఇంటింటికీ వెళ్లి తుపాను హెచ్చరికలు

జామి: మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఇంటింటికీ వెళ్లి దానా తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

కేజీబీవీ నిర్మాణాల పరిశీలన

వేపాడ:మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను మండల స్థాయి అధికారులు గురువారం పరిశీలించారు. కేజీబీవి పాఠశాలలో అదనపు తరగతి భవనం నిర్మాణానికి సర్వ శిక్షా అభియాన్ పథకంలో నిధులు మంజూరు చేశారు. అయితే ఈ నిర్మాణాలు చాలా కాలంగా ఆగిపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు లక్కవరపుకోట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడిరాజు, ఎంపీడీవో సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తదితరులు గురువారం పాఠశాలను సందర్శించి నిర్మాణ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మాటాడుతూ ఈ మేరకు నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.

ఉచిత పశువైద్యాన్ని వినియోగించుకోవాలి

చీపురుపల్లి, అక్టోబరు 24: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పశువైద్యాన్ని పశు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. శారద కోరారు. పట్టణంలోని జి. అగ్రహారంలో జరుగుతున్న నట్టల నివారణ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 30 వరకూ కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, పశుపెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 33657 జీవాలకుగాను ఇప్పటి వరకూ 70 శాతం జీవాలకు మందులు పంపిణీ చేయడం పూర్తయ్యిందన్నారు. అనంతరం 650 గొర్రెలు, 150 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏ సమస్యనైనా తెలియజేయండి

సమస్య పరిష్కరించే బాధ్యత నాది: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎటువంటి సమస్య తలెత్తినా ఒక్క వాట్సాప్ మెసేజ్ చేస్తే వాటిని పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మంత్రి కావడంతో అందుబాటులో లేక పోయినప్పటికీ ఒక్క వాట్సాప్ మెసేజ్ చేస్తే ఎంతటి సమస్య అయినా ఒక్క రోజులో పరిష్కారం చూపేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించే దిశగా 300 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మొదటి విడతలో 50 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు చేపట్టామని, మిగిలిన మూడు విడతల్లో జనవరి లోగా పనులు పూర్తి చేస్తామన్నారు. టీడీపీ కార్యకర్తలపై గత వైసీపీ ప్రభుత్వం కేసులు నమోదు చేసి హింసకు దారి తీసిందని, దీనిపై ముఖ్యమంత్రి లీగల్ సెల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మండలంలోని సభ్యత్వ నమోదు అధిక శాతం పూర్తి చేయాలని కోరారు. నాయకుల కోరిక మేరకు అధిక సభ్యత్వం నమోదు చేసిన మండలానికి బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. రానున్న సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవం కావాలని, అందుకు గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. మండలపార్టీ అధ్యక్షులు, చప్పా చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరనాయుడు, కోరాడ కృష్ణ, సీనియర్ నాయకులు పి.వి.వి. గోపాలరాజు, మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీలు మక్కువ శ్రీధర్, బండారు బాలాజీతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లను చైతన్యంతో ఎదుర్కోవాలి

విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి



పోలీసు వందనం స్వీకరిస్తున్న డీఐజీ

బొబ్బిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చుకుని ఏకంగా పోలీసు అధికారులుగా చెప్పుకుంటూ ప్రజలనుంచి అక్రమంగా డబ్బులు గుంజుతున్నారని, ఇలాంటి వాటిని ప్రజలే చైతన్యవంతులై సమర్థంగా తిప్పికొట్టాలని విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. బొబ్బిలి పోలీసుస్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు ముంబై ఇతర ముఖ్యనగరాల నుంచి మాట్లాడుతున్నామని, పోలీసు, సీబీఐ, ఈడీ తదితర అధికారులుగా చెప్పుకుంటూ అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వారి పిల్లల పేరుతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారన్నారు. క్రోర్టులు, పోలీసుస్టేషన్ సెట్టింగ్‌లతో గ్రాఫిక్స్ సృష్టించి మీ పిల్లలు మా అదుపులో ఉన్నారంటూ నమ్మబలుకుతూ పెద్ద పోలీసు అధికారులుగా చెప్పుకుంటూ వంచనకు పాల్పడుతున్నారన్నారు. దీనితో చాలా మంది బెంబేలెత్తిపోయి వారి వలలో చిక్కుకుంటూ డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇంకొంతమంది లౌక్యంగా తప్పించుకుంటున్నారన్నారు. బొబ్బిలిలో ఇటీవల ఓ ఉపాధ్యాయుడు గట్టిగా ప్రతిఘటించడంతో వారు పత్తాలేకుండా పోయారన్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి పట్ల వెంటనే పోలీసులకు లేదా టోల్ ఫ్రీనెంబరుకు సమాచారం అందివ్వాలన్నారు. తప్పుడు సమాచారంతో ఎవరైనా ఫోన్ చేస్తే భయాందోళనలకు గురికాకుండా కాస్త చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా, వ్యాపారం చేసే వారిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు.

● డీఐజీకి స్థానిక పోలీసులు గౌరవ వందనంతో ఘనంగా స్వాగతం పలికారు. మొక్కలు అందించి ఎస్పీ వకుల్ జిందాల్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసు రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును, కేసుల నమోదు, వాటి పరిష్కారం ప్రగతిని సమీక్షించారు. మహిళా పోలీసులతో ముఖాముఖి నిర్వహించారు. రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. పోలీసుల కోసం వాలీబాల్ కోర్టును ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో స్థానిక డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ కటకం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లాదిలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

బాడంగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖకు చెందిన ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి మండలంలోని గొల్లాది గ్రామాన్ని గురువారం సందర్శించారు. గొల్లాదిలో రెండున్నరేళ్ల ఎస్.యామినికి మిజుల్స్(తట్టువ్యాధి) పాజిటివ్ రావడంతో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ నుంచి విజయనగరం సర్వజన ఆసుపత్రికి రిఫర్‌చేసి చికిత్స చేయడంతో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారుల్లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. ఎస్ఎంవో జాన్‌జాషువాతో కలిసి ఆమె గ్రామానికి వెళ్లి సందర్శించారు. అక్కడే ఉన్న వెల్నెస్ కేంద్రంలో వైద్యశాఖ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అదే విధంగా గ్రామంలో ఫార్మెట్ ప్రకారం సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఇలాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాడాడ పీహెచ్‌సీ వైద్యాధి కారి ఆదిత్య, ఏఎన్ఎం మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ వాసవి, ఎంపీహెచ్ఈవో జోగినాయుడు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న తిరుపతినాయుడు

రామభద్రపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న తాగునీటి సంఘా ల ఎన్నికలకు తెలుగుదేశం కార్యకర్తలు సన్నద్ధం కావాలని జిల్లా పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు కోరారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని సంఘాలను తెలుగుదేశం పార్టీ కైవశం చేసుకునే విధంగా కార్యకర్తలు ఇప్పటినుంచే పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికలపై ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ప్రకటన విడుదల చేయడంతో రైతులను కలిసి ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి చర్యలు వివరించాలన్నారు. రైతుల అభ్యున్నతికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తిచేయాలని నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బొబ్బిలి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మొదటి విడతగా 8కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఆయన హయాంలో మరిన్ని నిధులతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ నాయకులు హరిబాబు, రౌతు శంకరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలి

మహిళా నేత వనజాక్షితో రాష్ట్ర హోం మంత్రి అనిత



మంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న వనజాక్షి, రవిశేఖర్

నెల్లిమర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషిచేయాలని రాష్ట్ర హోమ్ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులై జిల్లాకు తొలిసారిగా వచ్చిన అనితకు గురువారం టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వనజాక్షి, రవిశేఖర్ మాట్లాడుతూ అనిత సమర్థత గల నాయకురాలని, ఆమె హయాంలో జిల్లాలోని సమస్యలు పరిష్కారమై అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు.

అశోక్‌ని కలిసిన అనిత

విజయనగరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం విజయనగరం వచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో విజయనగరం వచ్చిన ఆమె తొలుత పార్టీ కార్యాలయానికి వెళ్లి అశోక్ గజపతిరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను కలిసి పరిచయం చేసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో తాను జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, సమస్యలను ఎమ్మెల్యేల ద్వారా, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన కర్రోతు

డెంకాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా వచ్చిన రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనితకు డెంకాడ మండలం మోదవలస సమీపంలో రాష్ట్ర మార్క్‌ఫైడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, నెల్లిమర్ల మాజీ ఎంపీపీ సువ్వాడ వనజాక్షి, భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటరీ అధికార ప్రతినిధులు కడగల ఆనంద్‌కుమార్, పాణిరాజు, గేదెల రాజారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘బెర్రీ’ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సభ్యులు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో గురువారం సీపీఎం గ్రామ మహాసభ, కార్యదర్శి గేదెల అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి దగ్గరలో ఉన్న బెర్రీ కంపెనీ వారు 10 హెచ్‌పీ మోటార్‌తో 24 గంటలు భూగర్భ జలాలు తోడేస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయి ప్రజలకు కనీస అవసరాలకు కూడా గ్రామంలో చేతి బోరు ద్వారా నీరు రావడంలేదని, కంపెనీ ఇష్టానుసారం కాలుష్యాన్ని వెదజల్లుతున్నా పొల్యూషన్ బోర్డు గానీ ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికా రులు జోక్యం చేసుకొని బెర్రి కంపెని యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎస్ గోపాల్, కోలా శంకరరావు, చుక్క రమణమ్మ, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు శంకరారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సమస్యలపై దృష్టి సారించాలి

మక్కువ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్‌రావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఐరిస్క్ గర్భిణులపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులతో ఎవరైనా ఆసుపత్రికి వస్తున్నారా.. అని ఆరా తీశారు. పిల్లల టీకా నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి వారం నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. ఓపి, ఐపీ వివరాలు పరిశీలించారు. సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిగ్రస్థుల ఆరోగ్యాన్ని ప్రతి నెలా పరిశీలించి, ఆరోగ్యం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కాశీపట్నం కేజీబీవీని పరిశీలించి విద్యార్థులు ఆరోగ్య స్థితిపై వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల, పాఠశాల ప్రత్యేక అధికారి జి.నాగదుర్గ, వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రునికి ప్రత్యేక అభిషేకాలు



నెల్లిమర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారామచంద్రుల ఉత్సవవిగ్రహాల వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో ప్రాత:కాలార్చన, బాలభోగం అనంతరం యాగశాలలో సుందర కాండహవనం చేశారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమాలు దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ నిర్వహించారు.

తైక్వాండో ఎంపికలు

డెంకాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చింతలవలస వద్దగల ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జేఎన్‌టీయూ యూనివర్శిటీ తైక్వాండో జట్టు ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ, ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన జవహర్‌లాల్ టెక్నాలజికల్ యూనివర్శిటీ తైక్వాండో జట్టు ఎంపికలకు జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల నుంచి అనేకమంది విద్యార్థులు, విద్యార్థినులు హాజరయ్యారన్నారు.

రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తా: కోళ్ల



మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

కొత్తవలస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించిన భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా కృషిచేస్తానని ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బాధితులకు భరోసా ఇచ్చారు. గురువారం ఉత్తరాపల్లి గ్రామ సచివాలయంలో ఉత్తరాపల్లి గ్రామానికి చెందిన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో రైతులకు నష్టపరిహారం కింద పాస్ చేసిన అవార్డు ప్రకారం కొంతమంది రైతులకు క్లయిమ్‌లను ఆమె చేతులు మీదుగా అందజేశారు. భూములు కోల్పోయిన రైతులకు సెంటుకి 35 వేల రూపాయలు నష్ట పరిహారం కింద అవార్డులు పాస్ చేసిన విషయం తెలిసిందే! తమకు సెంటుకు కనీసం 50 వేల రూపాయలు అయిన మంజూరు చేయాలని సోమవారం కొత్తవలస వచ్చిన ఆర్డీవో దాట్ల కీర్తిని రైతులు కోరారు. ముందుగా అవార్డు ప్రకారం మంజూరు చేసిన 35 వేల రూపాయలను తీసుకోవాలని ఆమె సూచన చేశారు. ఇందులో భాగంగానే గురువారం క్లయిమ్‌లను తీసుకున్నారు. సెంటుకు 35 వేల రూపాయలు చొప్పున తీసుకుంటే తాము పూర్తిగా నష్టపోతున్నామని ఎమ్మెల్యేను కోరారు. రైతులకు అన్ని విధాల న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపారు. 21 ఎకరాల భూమికి సంబంధించి 53 మందికి నష్టపరిహారమిచ్చారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం



చీపురుపల్లిలో 53 మందికి గాయాలు



కుక్కల దాడిలో క్షతగాత్రులకు గాయమైన దృశ్యం, చీపురుపల్లిలో క్షతగాత్రులకు వైద్యం అందజేస్తున్న సిబ్బంది

చీపురుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో గురువారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సంచరించి 53 మందిని గాయపరిచాయి. జి. అగ్రహారం, పిల్లపేట, శివరాం రోడ్డు, డైలీ మార్కెట్, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మహిళలు, విద్యార్థులపై దాడి చేశాయి. దీంతో వీరంతా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో పట్టణంలో రెండు పిచ్చి కుక్కల స్వైర విహారంతో అలజడి రేగింది. గాయపడిన వారంతా ఒకేసారి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకోవడంతో, అక్కడ ఆందోళనకర వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న స్థానిక వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని, గాయపడిన వారికి సపర్యలు చేశారు. కర్లాం పీహెచ్‌సీ వైద్యులు డా. సువర్ణ, అక్కడి సిబ్బంది చీపురుపల్లి చేరుకుని వైద్యం అందించారు. పిచ్చికుక్కల సమాచారం అందుకున్న పంచాయతీ తనిఖీ అధికారి జి. వేణుగోపాలరావు, తన సిబ్బందితో కలిసి కుక్కల్ని పట్టుకొని దూర ప్రాంతానికి తరలించారు.

జిల్లా వైద్యాధికారికి ఎమ్మెల్యే ఫోన్

చీపురుపల్లిలో కుక్కల దాడిలో 53 మందికి గాయాలైన సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తక్షణమే స్పందించి, జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడారు. కుక్కలు జరిపిన దాడిలో ఎక్కువ మంది గాయపడినందున అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి వ్యాక్సిన్ తెప్పించాలని సూచించారు. అవసరమైన మేరకు ఇతర ప్రాంతాల నుంచి వైద్యుల్ని కూడా రప్పించాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధీర్ పర్యవేక్షణలో సిబ్బంది చికిత్స చేశారు.

బొబ్బిలిలో పోక్సో కేసు నమోదు

గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి చెందిన యువకుని అరెస్టు

బొబ్బిలి అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో మైనర్‌బాలికపై అత్యాచారం జరిగినట్లు అభియోగం రావడంతో గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన కిల్లక మోహనరావు(30) అనే నిందితుని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పార్వతీపురంలో చదువుకుంటున్న మైనర్ బాలిక పరీక్ష ఫీజు డబ్బుల కోసం బొబ్బిలిలో గల మోహనరావు దగ్గరకు ఈ నెల 21న వచ్చింది. తమ సమీప బంధువు సూచన మేరకు బాలిక ఇక్కడికి రావడంతో నిందితుడు మోహనరావు మల్లమ్మపేటలో గల తన రూముకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక బంధువు పార్వతీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు ఈ కేసు నమోదు చేసి ఆన్‌లైన్‌లో గురువారం బొబ్బిలి పోలీసు స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. దీనిపై దర్యాప్తు నిర్వహించి నిందితుడు మోహనరావును పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. నిందితుడు సిమెంట్ పనులకు వెళుతూనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడని ఆయన తెలిపారు.

కొమరాడ మండలంలో...

కొమరాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నీలకంఠం గురువారం తెలిపారు. గ్రామంలో 16 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్టు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



శంకరరావు (ఫైల్)

మక్కువ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన చెముడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు.. చెముడు గ్రామానికి చెందిన కోట శంకరరావు(49) గ్రామంలో చిన్న చిన్న విద్యుత్ మరమ్మతులు చేస్తుంటాడు. ఇదే క్రమంలో ఓ వ్యక్తి ఇంటికి కరెంట్ లేకపోవడంతో విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు సరిచేస్తుండగా ఇన్వర్టర్ వైర్ లో విద్యుత్ ప్రవహించడంతో షాక్‌కు గురయ్యాడు. అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమయ్యింది. గుర్తించిన స్థానికులు మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటరమణమూర్తి తెలిపారు.

సారా స్వాధీనం

గరుగుబిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకడివరం రహదారి జంక్షన్‌లో వ్యాన్‌తో పాటు మోటారు సైకిల్‌పై తరలిస్తున్న సారా క్యాన్లను గురువారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పి.రమేష్ నాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కొంకడివరం రహదారి జంక్షన్‌లో దాడి చేశామని చెప్పారు. బాలగుడబ గ్రామానికి చెందిన వై.కిశోర్, బి.కృష్ణతో పాటు వంగర గ్రామానికి చెందిన కె.రమేష్‌ను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని ఎస్ఐ చెప్పా రు. ఈ దాడుల్లో హెచ్ కానిస్టేబుల్ ఎన్.ఈశ్వరరావు, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

మక్కువ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చర్చి జంక్షన్ వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం బర్లబంద గ్రామానికి చెందిన కంద్రక నరేష్ నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు హెచ్‌సీ పైడయ్య తెలిపారు. ఆ వ్యక్తి నుంచి ద్విచ క్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం సాలూరు కోర్టుకు తరలించినట్టు హెచ్‌సీ తెలిపారు.

శతశాతం రికవరీకి చర్యలు

● ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో స్వయం సహాయ సంఘాలకు ఉన్నతి సబ్‌ప్లాన్ ద్వారా అందించిన రుణాలను శతశాతం రికవరీ చేస్తామని పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. ‘రుణాలు సరే రికవరీ ఏది’ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆ యన గురువారం స్పందించారు. మండల సమాఖ్యలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ సంఘ సభ్యుల ఖాతాకు 2013-14 నుంచి 2020-21 వరకు రూ.6 కోట్లు 94 లక్షలు జమ చేశామని తెలిపారు. అపరాద రుసుంతో రూ.3 కోట్ల 28 లక్షలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. అయితే ఈ ఏడాది సభ్యుల నుంచి రూ.7లక్షల 50వేలు రికవరీ చేశామని చెప్పారు. తీసుకున్న రుణం వీవో నుంచి సెర్ప్ ఉన్నతి ఖాతాకు తిరిగి చెల్లించే విధంగా మండల సమాఖ్య సిబ్బంది చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. సంబంధిత అధికారులతో రుణాలను రికవరీ చేస్తామని ఆయన తెలిపారు. రికవరీ డ్రైవ్ నిర్వహించి రికవరీ శాతం పెంచాలని ఆదేశించామన్నారు. రివకరీ శాతం తక్కువ ఉన్న సీతంపేట మండలంలోని నలుగురు కమ్యూనిటీ కోఆర్డినే టర్లు, ఉన్నతి యాంకర్ పర్సన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

పాలకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్ కళాశాలల టోర్నమెంట్, ఎంపిక ప్రక్రియ గురువారం కొనసాగింది. ఈ టోర్నమెంట్, ఎంపిక ప్రక్రియలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ వాలీబాల్ (పురుషులు) విభాగంలో రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రథమ స్థానం, పాలకొండ సీఎల్‌నాయుడు డిగ్రీ కాలేజ్ ద్వితీయ స్థానం, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (పురుషులు) తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. అలాగే వాలీబాల్ మహిళల విభాగంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ స్థానంలోనూ, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ తృతీయ స్థానంలో నిలిచాయని చెప్పారు. కబడ్డీ మహిళల విభాగంలో సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ స్థానం, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానాన్ని సాధించాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

జడ్పీ గాడిన పడేనా?

(5వ పేజీ తరువాయి)

సభ్య సమావేశంలో మంత్రులు సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పలు సమస్యలను లేవనెత్తారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి శివారు ప్రాంతానికి నీరు ఎందుకు అందడం లేదని వారు అధికారులను అడిగారు. కాలువల అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు విదల్చలేదని, దీంతో షట్టర్లు లీకేజీ, మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో శివారు భూములకు నీరందని పరిస్థితి తలెత్తిందని అధికారులు వివరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో రైతాంగం సమస్యలతో పాటు పారిశుధ్యం, తాగునీరు, తదితర సమస్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

పోలియో రహిత సమాజమే రోటరీ లక్ష్యం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి శశిభూషణరావు

బొబ్బిలి, అక్టోబరు 24: అంతర్జాతీయ పోలియో నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని బొబ్బిలి పట్టణంలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా రోటరీ చైర్మన్ జేసీ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జీ.శశిభూణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌సీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు నినాదాలు చేశారు. రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసన్, ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, రామకృష్ణ, శ్రీనివవాసరావు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన అవనాపు విక్రమ్



విజయనగరం టౌన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనితను జనసేన నాయకుడు అవనాపు విక్రమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌కు గురువారం విచ్చేసిన హోం శాఖ మంత్రి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం, విక్రమ్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

ఆర్డీవో స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాట్ల కీర్తి

పూసపాటిరేగ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానికంగా గల ఒక హెచ్‌పీ గ్యాస్ గొడౌన్‌కు రాకపోకలకు కోసం కాలువపై కల్వర్టు నిర్మించుకునేందుకు అనుమతులకు దరఖాస్తు చేసుకోగా ఆ స్థలాన్ని గురువారం ఆర్డీవో దాట్ల కీర్తి పరిశీలించారు. తన గొడౌన్‌కు వెళ్లేందుకు వర్షపునీటి కాలువపై కల్వర్టు నిర్మించుకునేందుకు అనుమతించాలంటూ గతంలో దాని యజమాని చేసుకున్న దరఖాస్తు మేరకు ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దారు గోవింద్, రెవెన్యూ అధికారులు, జలవనరులశాఖ ఇంజినీర్ పాల్గొన్నారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు సూచించారు. ఉపాధి శిక్షణా శాఖ సంచాలకులు ఆదేశాల మేరకు ఐదో విడత ప్రవేశాల కోసం వివిధ ట్రేడుల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకుగాను అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నామని ఆయన చెప్పారు. ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, 27వ తేదీన ఒరిజినల్ ధ్రువపత్రాలను మధ్యాహ్నం 3 గంటల లోగా కళాశాలకు తీసుకు రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

బెలగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు ఈవీ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.906 కోట్లు మాత్రమే ఇచ్చి కాలయా పన చేసిందే తప్ప న్యాయం చేయలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అగ్రిగోల్డ్ ఆస్తులు విక్రయించి బాధితులను ఆదుకోవాల ని డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాజాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్యాంపురం గ్రామంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సంతకవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన ఇనుమల అనీల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కెంబూరు వాసుదేవనాయుడు ఇటీవల కాలంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆయనకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్ష చెక్కును ఆయన భార్య కెంబూరు స్వప్నకు ఎమ్మెల్యే అందజేశారు.

కొల్లను పరామర్శించిన కోండ్రు

రాజాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురై రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. ఈయనతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బైపాస్‌లో భారీ గుంతలో నుంచి వెళ్తున్న లారీ

బైపాస్‌లో భారీ గుంత

- వాహన చోదకులకు నిత్యం తప్పని చింత
- స్పందించని అధికారులు

పార్వతీపురంటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం గుండా వెళ్తున్న బైపాస్ రోడ్డు మధ్యలో భారీ గుంత ఏర్పడింది. దీంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల బైపాస్‌లో ఉన్న చిన్న చిన్న గుంతలు భారీగా మారాయి. ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు భీతిల్లుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి భారీ గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సీతానగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ పాఠశాలలో గురువారం జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మండల కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్ తెలిపారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎన్.శ్రీనివాసరావు, కె.భాస్కరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగిందన్నారు. మండల శాఖ నూతన గౌరవధ్యక్షుడిగా టి.మధుసూదనరావు, అధ్యక్షుడిగా పల్లి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా ఎ.పోలినాయుడు, మహిళా సహాధ్యక్షురాలుగా కె.లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాదరావు, కోశాధికారిగా డీవీ రమణలతో పాటు జిల్లా, మండల కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గంతో పదవీ స్వీకార ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖిల భారత పశుగణన

గరుగుబిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పశు సంవర్థకశాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. మండల పశు సంవర్థక శాఖ కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. 21వ అఖిల భారత పశుగణన సందర్భంగా ఆయా గ్రామాల్లో పశు సంవర్థకశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశువుల వివరాలను సేకరిస్తారని చెప్పారు.

నట్టల నివారణ మందు పంపిణీ

ఉల్లిభద్ర గ్రామంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు సంవర్థక శాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

- పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర
- మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల సందర్శన

పార్వతీపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎమ్మెల్యే విజయచంద్ర ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఉద్యోగుల హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల కు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతు న్నట్టు ఎమ్మెల్యే గుర్తించారు. పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను తక్షణ మే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

● పార్వతీపురంటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం సందర్శించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సమావేశ మయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణపై ఆయా శాఖాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

● పార్వతీపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వినతులు స్వీకరించారు. మండలంలోని వెంకమ్మపేటలో ఉన్న తన కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యలపై వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రహదారులు తదితర సమస్యలపై పలువురు వినతిపత్రాలను అందించారు. వీటిపై ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు తీసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులకు ఫోన్‌లో సూచించారు.



పార్వతీపురంటౌన్: ముస్లింల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ముస్లింల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురంటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక బైపాస్ రహదారిలో గల మసీదులో ముస్లిం సోదరులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మక్కా వెళ్లేందుకు ఎటువంటి సహాయ సహకారాలను అందించలేదని, ఎన్డీఏ ప్రభుత్వంలోనైనా తమ పవిత్ర స్థలాన్ని దర్శించుకునే భాగ్యాన్ని కల్పించాలని ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వం ద్వారా సహాయ, సహకారాలను అందించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మజ్జి కృష్ణమోహన్, మజ్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తు న్నామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గురువారం తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా 6 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టుపై ఆధారపడిన గిరిజన మత్స్యకారులకు పార్వతీ పురం ఐటీడీఏ నుంచి అవసరమైన సహకారాన్ని అందిస్తు న్నామని చెప్పారు. అలాగే 4 లక్షల చే పిల్లలను ఇతర ప్రాంతాల్లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ సమీపంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి అవసరమైన హెచరీ కోసం స్థలం మంజూరుకు చర్యలు చేపడుతున్నా మని చెప్పారు. అలాగే మత్స్యకారులకు లైసెన్సుల మంజూరుకు కృషి చేస్తు న్నామన్నారు. సమస్యల ను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సకాలంలో పరిష్కారానికి చొరవ చూపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, పాలకొండ డివిజన్ మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలం నాయుడు, మత్స్యకార సంఘ అధ్యక్షులు తిరుపతిరావు, టీడీపీ ప్రతిని ధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, డి.సత్యనారాయణ, ఎ.రాంబాబు, ఎంవీ విజయవాంకుశం, ఎం.నారాయ ణస్వామి, పి.వెంకటనాయుడు, పి.పూర్ణచంద్ర రావు, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గంగన్నవలస సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నది. ఈ విషయాన్ని ఏపీఈ పీడీసీఎల్ ఈఈ గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫలించిన మహిళల ఆందోళన

- మద్యం షాపును తరలిస్తామని ప్రకటించిన ఎక్సైజ్ సీఐ

బొబ్బిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని మేదరబంద జంక్షన్ సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం షాపును స్థానికుల ఆందోళనల మేరకు వేరే చోటకు తరలిస్తామని ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు అధికారికంగా ప్రకటించారు. మద్యం షాపు దగ్గరకు గురువారం సీఐ వచ్చి టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు, వార్డు పెద్దలు, ఆందోళన చేస్తున్న మహిళలతో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరు వరకు తాత్కాలిక అనుమతి ఉన్నందున, ఈ లోగా వేరే చోటకు షాపును తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానికుల ఆందోళన మేరకు తాము జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా షాపు తరలింపునకు ఆదేశాలిచ్చారన్నారు. దీంతో ఇక్కడి షాపును వేరే చోటకు తరలించడం ఖాయమని సీఐ చిన్నంనాయుడు వారికి హామీ ఇచ్చారు. దీనిపై టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బేబీనాయన మహిళల ఆందోళనను అర్థం చేసుకుని స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.